ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

గురువారం 17 ఏప్రిల్ 2025

పనులన్నీ మాకే..!



- కాంట్రాక్టు పనులు మీరెవరూ చేయవద్దు ● కాదని చేస్తే బిల్లులు రాకుండా అడ్డుకుంటాం
- పాత పనులు తిరగదోడుతాం.. విజిలెన్స్ ఎంక్వయిరీ వేయిస్తాం
- బెదిరిస్తున్న 'ముగ్గురు' ● దీంతో గడువు దాటినా ఖరారు కాని టెండర్లు
- ఇదీ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల తీరు ● రూ.8.80 కోట్ల పనులు చేపట్టేదెన్నడు?

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో చేపట్టిన కాంట్రాక్టు పనుల్లో కొందరు వైసీపీ ముఖ్య నేతలు 8 శాతం కమీషన్ వసూలు చేస్తే.. ఇప్పుడు ఏకంగా పనులన్నీ తమకే కావాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పనులకోసం ఎవరూ టెండర్లు వేయవద్దు, మేమే వేయాలి, లేదంటే మాకు కమీషన్ ఇచ్చి మా ఏజెన్సీ పేరుతో చేసుకోవాల్సిందే అంటున్నారు. కడప నగరంలోని టీడీపీ ముఖ్యనేత మనుషులుగా చెలామణి అవుతున్న ఓ ముగ్గురు గ్రూపుగా ఏర్పడి కాంట్రాక్టర్లను హెచ్చరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. వీరికి కార్పొరేషన్‌లోని ఇదే సెక్షన్‌లోని కొందరు అధికారులు కూడా సహకరిస్తుండడంతో 'ముగ్గురు' చెలరేగిపోతు న్నారు. టెండరు వేసి గడువు పూర్తయి ఎనిమిది రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఇంకా తెరవకపోవడం గమనార్హం. దీని పూర్తి వివరాలు తెలుసుకోవాలనుకుంటే కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ సెక్షన్‌లోకి వెళ్లాల్సిందే..

15వ ఆర్థిక సంఘం నిధులు

కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి కార్పొరేషన్, మున్సిపాలిటీలకు నిధులు కేటాయించింది. సిమెంటు రోడ్లు, మురుగుకాల్వలు, కల్వర్టులు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుకోసం ఈ నిధులు ఖర్చు చేయాలి. కడప కార్పొరేషన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధుల్లో తొలివిడతలో రూ.8.80 కోట్లతో సీసీరోడ్లు, డ్రైన్స్, కల్వర్టులు, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ కోసం మొత్తం 104 పనులకు టెండర్లు పిలిచారు. ఒక పని అంచనా వ్యయం రూ.2.50లక్షల నుంచి రూ.10లక్షల వరకు వేశారు. ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు నిర్వహించారు. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 3గంటల లోపు బిడ్ దాఖలుకు అవకాశం ఇచ్చారు. దీంతో పలువురు కాంట్రాక్టర్లు పనుల కోసం టెండరు వేశారు. అయితే ఈ పనులపై కన్నేసిన 'ముగ్గురూ' టెండరు నోటీసు రాకముందే ఒక మీటింగ్ కూడా ఏర్పాటు చేశారు. ఈ వర్కుల కోసం కార్పొరేటర్లు టెండర్లు వేయవద్దు, కేవలం కాంట్రాక్టర్లే వేయాలని చెప్పారు. అది కూడా తాము చెప్పిన వాళ్లే టెండరు వేయాలని ఆ మీటింగులో సుతిమెత్తగా హెచ్చరించినట్లు చెబుతారు. అయితే టీడీపీ, వైసీపీకి చెందిన 16 మంది రిజిస్టరు కాంట్రాక్టర్లు ఈ పనుల కోసం టెండర్లు వేశారు. వీరితో పాటు ఆ ముగ్గురికి చెందినవారు టెండర్లు వేసినట్లు చెబుతారు. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 3గంటల తరువాత అధికారులు బిడ్‌లు తెరవాల్సి ఉంది. ఎవరెవరి పేరిట టెండర్లు దాఖలయ్యాయి. ఎంత లెస్‌కు వేశారు అనేవి పరిశీలించాలి. తరువాత లెస్‌కు వేసిన వారితో అగ్రిమెంట్లు చేసుకోవాలి. ఇదీ ప్రాసెస్.

ఇదెక్కడి న్యాయం

కార్పొరేషన్‌లో పలువురు రిజిస్టరు కాంట్రాక్టర్లు ఉన్నారు. ఇక్కడ టెండర్లలో పాల్గొంటూ పనులు చేసుకుంటుంటారు. ఈసారి కూడా వైసీపీకి చెందిన 11 మంది కాంట్రాక్టర్లు, టీడీపీకి చెందిన ఐదుగురు టెండర్లు వేశారని అంటున్నారు. అయితే మీరు తప్పుకోండి, మేమే చేస్తామని 'ముగ్గురు' హెచ్చరిస్తుండటంతో కొందరు టీడీపీ కాంట్రాక్టర్లు కూడా ఔరా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ముందే బెదిరింపులు

ఆర్థిక సంఘం నిధులపై కన్నేసిన నేతలు టెండర్లలో ఎవరూ పాల్గొనకుండా ముందే హెచ్చరికలు చేసినట్లు చెబుతారు. కాంట్రాక్టర్లతో మీటింగు పెట్టడంతో పాటు కార్పొరేషన్‌లో వేసిన టెండర్లన్నీ ఎర్రముక్కపల్లెలోని ఓ నెట్ సెంటరు నుంచి ఎక్కువగా దాఖలు చేశారు. ఆ నెట్ సెంటరు నిర్వాహకుడిని కూడా బెదిరించినట్లు చెబుతారు. మేం సూచించిన వారికి మాత్రమే ఇక్కడ టెండర్లు దాఖలు చేయి అంటూ అతనికి కూడా వార్నింగ్ ఇచ్చారని అంటున్నారు. మొత్తానికి ఈ వ్యవహారం కడప కార్పొరేషన్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. కాగా.. కార్పొరేషన్‌లో రూ.8.80 కోట్లతో చేపట్టాల్సిన పనుల టెండర్ల గడువు దాటినా వీటిని ఖరారు చేయకపోడంపై ఎస్ఈ చెన్నకేశవరెడ్డిని ఆంధ్రజ్యోతి ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



ఆ ముగ్గురి హెచ్చరికలు

ఎవరెవరు టెండరు వేశారు.. ఎంతకేశారనే వివరాలను తీసుకున్న ఆ ముగ్గురు నేరుగా కాంట్రాక్టర్లకు హెచ్చరికలు పంపుతున్నారు. "మీరు ఈ కాంట్రాక్టు పనుల నుంచి తప్పుకోండి.. మాకు ఆరోగ్యం బాగాలేదు. మేం పనులు చేయలేకున్నాం అని లెటరు రాసి అధికారులకు ఇవ్వండి. లేదని ముందుకెళితే మాత్రం ఈ పనులు చేసినా మీకు బిల్లు రాకుండా చేస్తాం. గతంలో మీరు చేసిన పనులపై విజిలెన్స్ విచారణ వేసి మీకు బిల్లులు రాకుండా చూస్తాం" అంటూ హెచ్చరిస్తున్నట్లు చెబుతున్నారు. అధికారులు కూడా వీరికి వత్తాసు పలుకుతూ ఎందుకు వారితో పెట్టుకుంటారు, మళ్లీ మీ పాత పనులపై విజిలెన్స్ విచారణ వేస్తే మీతో పాటు మాకూ ఇబ్బందే.. తప్పుకోండి అని సూచిస్తున్నారని సమాచారం. 8వ తేదీతో గడువు ముసినా ఇప్పటికీ టెండర్లు ఖరారు చేయకపోవడం గమనార్హం.

లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 828 యూనిట్ల ఏర్పాటు ● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన డీసీసీ బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సబ్సిడీ రుణాలను అందిస్తోందన్నారు. పరిశ్రమల రంగం, ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్, వ్యవసాయరంగం విభాగాలలో రూ.34.40 కోట్లతో 828 యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఇందులో లబ్ధిదారుల పెట్టుబడి రూ.1.72 కోట్లు, బ్యాంకుల రుణ సాయం రూ.19.11 కోట్లు కాగా ప్రభుత్వం రూ.13.57 కోట్లు సబ్సిడీ ఇస్తుందన్నారు. గ్రౌండింగ్ కానున్న ఈ యూనిట్లపై బ్యాంకర్లు, సంబంధిత ఫైనాన్స్ కార్పొరేషన్ల అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఏపీఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 29వ తేదీన కడప హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని ఇందులో బ్యాంకర్లు పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజరు జనార్దనం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, బ్యాంకుల ప్రతినిధులు విహారి, విలియమ్స్, వాణీ కిశోర్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస ప్రసాద్, జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, కిరణ్‌కుమార్, డాక్టర్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి విశిష్ట పురస్కారాల ప్రదానం



మంత్రి కందుల దుర్గేశ్ చేతులమీదుగా పురస్కారాలు అందుకుంటున్న కె.సుభాష్‌చంద్రబోస్, మూల మల్లికార్జునరెడ్డి, రావలూరు సుబ్రహ్మణ్యం

కడప కల్చరల్ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కందుకూరి విశిష్ట పురస్కారాలను పలువురికి అందజేసింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వీటిని అందజేశారు. జిల్లాకు చెందిన ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, రావలూరు సుబ్రహ్మణ్యం, కె.సుభాష్‌చంద్రబోస్ పురస్కారాలను అందుకున్నారు.

ప్రజాసమస్యలు అలక్ష్యం చేస్తే చర్యలు

- జీవోలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
- రెవెన్యూ సిబ్బందికి కలెక్టర్ హెచ్చరికలు



రెవెన్యూ వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించే విషయంలో అలక్ష్యం చూపితే ఉపేక్షించేది లేదని రెవెన్యూ అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో జిల్లావ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వేశాఖ అధికారులకు రెవెన్యూ సమస్యలపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సేవల్లో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. చట్టప్రకారం మార్గదర్శకాల మేరకు పనిచేయాలన్నారు. ఎలాంటి సమస్య అయినా కాలాతీతం చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను ఆయా గ్రామాల వారీగా క్రోడీకరించుకోవాలన్నారు. ప్రతివారం పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ముఖ్యమంత్రి కార్యాలయం సమీక్ష చేస్తుందన్నారు. తహశీల్దార్లు ప్రతిరోజు ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని, ఆ గ్రామంలో సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భూముల విషయంలో నిబంధనల మేరకు పరిష్కారం చూపాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములు, ఆర్ఓఆర్, పట్టాదారు పాస్‌పుస్తకాలు, చట్టాలు తదితర అంశాలపై అవగాహనతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, సర్వే ఏడీ మురళీకృష్ణతో పాటు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- డీఐఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సుదర్శన్



మాట్లాడుతున్న డీఐఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సుదర్శన్

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఉపయోగించుకుని ఎస్సీలు, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సుదర్శన్ పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆ సంస్థ నిర్వహించిన పారిశ్రామిక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక పాలసీ ఎంతో అద్భుతంగా ఉందన్నారు. దానికి తోడు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు కూడా ఉపయోగించుకుని యువత పరిశ్రమలు పెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 45శాతం సబ్సిడీతో గరిష్ఠంగా రూ.7.50కోట్ల వరకు సబ్సిడీ ఇవ్వనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరో అతిథిగా పాల్గొన్న జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాషా మాట్లాడుతూ తమ శాఖ ద్వారా పరిశ్రమలు పెట్టుకున్న వెంటనే సబ్సిడీలు విడుదల చేస్తామన్నారు. పెండింగ్ సబ్సిడీల మొత్తం మేనె 15వ తేదీ లోపు విడుదల చేస్తున్నామని తెలిపారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో పీఎంఈజీపీ స్టాండప్ ఇండియా పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రాంతీయ మేనేజర్, దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.జయరాజు, జీవీ రమణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద హైస్కూల్ గుర్తింపు రద్దు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కమలాపురం వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ గుర్తింపును జోన్-4 ఆర్జేడీ రద్దు చేశారని డీఈఓ షంషుద్దీన్ తెలిపారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఇతర పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలలో అడ్మిషన్లు కూడా చేపట్టకూడదని ఆదేశించారు.

సమస్యలుంటే నా దృష్టికి తెండి

- జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

కడప రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా మండలాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జడ్పీ చైర్మన్ ఎం.రామగోవిందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జడ్పీ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్, సీఈఓ ఓబులమ్మతో కలిసి అభివృద్ధి పనులపై ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధిలోని ప్రతి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌ల కో-ఆర్డినేషన్‌తో ఆయా మండలాల్లో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసి పల్లెసీమల ప్రగతికి బాటలు వేయాలన్నారు. అనంతరం జడ్పీ చైర్మన్ చేత ఎంపీడీవోలు కేకు కట్ చేయించారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు.

మార్కెట్ యార్డులకు చైర్మన్ల నియామకం



బండి రామసూరారెడ్డి, సింహాద్రిపురం



సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, జమ్మలమడుగు

సింహాద్రిపురం / జమ్మలమడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు మార్కెట్ యార్డులకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సింహాద్రిపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా తొండూరు మండలం సంతకొవ్వూరు గ్రామానికి చెందిన టీడీపీ నేత బండి రామసూరారెడ్డిని నియమించారు. జమ్మలమడుగు మార్కెట్ యార్డు చైర్మన్‌గా టీడీపీకి చెందిన సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డిని నియమించారు. దేవగుడి గ్రామానికి చెందిన ఈయన జమ్మలమడుగులో కీలకనేతగా ఉన్నారు.

రక్తమోడిన రహదారులు

7

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

తనిఖీల్లో గోప్యత ఎందుకు..?

- పాడా పనులపై సాగుతున్న విజిలెన్స్ తనిఖీలు ● ఆ వివరాలు వెల్లడించని వైనం



పులివెందులలో పాడా పనులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ బృందం (ఫైల్)

పులివెందుల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గంలో చేపట్టిన పనుల నాణ్యత, అక్రమాలపై సాగుతున్న విజిలెన్స్ తనిఖీల్లో అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఏ రోజు ఎక్కడ తనిఖీలు చేశారో, చేస్తున్నారో మీడియా వారు అడిగినా చెప్పడం లేదు. ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా 356 పనులపై విచారణ జరుగుతోంది. పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడంతో ఆయన పాడా ఏర్పాటుచేశారు. తన హయాంలో పాడాలో 2019 నుంచి 2024 వరకు పెద్దఎత్తున అభివృద్ధి పనులు సాగాయి. దాదాపు రూ.4వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు సమాచారం. పనులు అడిగిందే తడవుగా మంజూరు కావడం, చేపట్టడం సాగుతూ వచ్చాయి. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రధానంగా సీసీరోడ్లు, ఆర్‌డబ్ల్యూఎస్ పనులు, ఇరిగేషన్ పనులు, ఎలక్ట్రీషియన్ పనులు, సుందరీకరణ పనులు.. ఇలా అనేక పనులు చేపట్టారు. అయితే ఈ పనులు ఇష్టమొచ్చినట్లు చేశారని, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని, కొన్ని పనులు చేయకుండానే బల్లులు చెల్లించారని అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ పనుల్లో నాణ్యత పరిశీలించడంతో పాటు జరిగిన అక్రమాలను వెలికితీసే బాధ్యతను ఇటీల రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్‌కు అప్పగించింది. విజిలెన్స్ అధికారులు పది రోజుల క్రితం పనుల నాణ్యత, పరిశీలన ప్రారంభించారు. మొదటి రెండురోజులు ఈ విషయం బయటకు పొక్కకుండా సాగించారు. ప్రారంభించిన మూడు నాలుగు రోజులకు మీడియాకు తెలిసింది. దీంతో ఒకటి రెండు రోజుల పాటు ఎక్కడెక్కడ విజిలెన్స్ తనిఖీలు సాగుతున్నాయి అనే వివరాలను ఒకరిద్దరు అధికా రులు విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. కానీ మూడు నాలుగు రోజులుగా నియోజకవర్గంలో ఎక్కడెక్కడ ఏయే పనులు పరిశీలిస్తున్నారో చెప్పడం లేదు. తనిఖీలు పూర్తయిన అనంతరం పైస్థాయి అధికారులు విలేకరుల సమావేశంలో వెల్లడిస్తారని, అంతకు మించి మరే వివరాలు అడగొద్దని ఓ అధికారి చెప్పడం గమనార్హం. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన తనిఖీల వివరాల గురించి చెప్పితే ఏమవుతుందని ఆ అధికారిని ఆంధ్ర జ్యోతి ప్రశ్నించగా విలేకరులతో టచ్‌లో ఉండొద్దని పైఅధికారుల నుంచి ఆదేశాలు ఉన్నా యన్నారు. ఏదిఏమైనా.. ఎక్కడ తనిఖీలు చేస్తు న్నారు.. తనిఖీల్లో ఏమి తెలిసింది అనే విషయా లను గోప్యంగా ఉంచడంపై పులివెందుల నియోజకవర్గ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

మహిళల రక్షణకోసం శక్తి టీంలు



శక్తిటీం వెహికల్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్



కడప క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా ప్రత్యేకంగా శక్తి టీమ్స్ ఏర్పాటు చేశామని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు వారు వినియోగించనున్న 56 ద్విచక్ర వాహనాలను జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలు వద్ద జెండా ఊపి ఎస్పీ ప్రారంభించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన శక్తిటీమ్స్ నిర్వర్తించే విధులు, చేపట్టవలసిన కార్యక్రమాలను ఎస్పీ దిశ నిర్దేశం చేశారు. రాష్ట్రంలో మహిళల పట్ల ఎటువంటి దాడులు, అఘాయిత్యాలు వేధింపులు లేకుండా చేసేందుకు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శక్తి టీంలను జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, కాలేజీలు, షాపింగ్‌మాల్స్ ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్యకూడళ్లలో నిఘా ఉంచాలన్నారు. ఈ శక్తి టీమ్స్ బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై వేధింపులు అరికట్టడం, నేరాలను నిరోధించడం, తక్షణ సాయం అందించి వారికి రక్షణ కవచంగా నిలిచేలా విధులు నిర్వహించాలన్నారు. జిల్లా హెడ్‌క్వార్టర్ కడపలో రెండు బృందాలు, కడప సబ్ డివిజను, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు సబ్ డివిజన్లలో ఒక్కో బృందం విధులు నిర్వర్తిస్తాయన్నారు. ఈ టీమ్స్‌లో ఎస్ఐ నేతృత్వంలో ఇద్దరు మహిళా సిబ్బంది, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటారన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్‌నకు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్ డయల్ 112/100, 181, 1098, 1930కాల్స్‌తో సంఘటన స్థలానికి ఈ టీమ్స్ వెళతాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె.ప్రకాశ్‌బాబు, రమణయ్య, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ రమాకాంత్, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు వీరేశ్, ఆనంద్, మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టరు యల్లమరాజు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీగా ఎన్.సుధాకర్ బాధ్యతలు

కడప క్రైం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్పెషల్‌బ్రాంచ్ నూతన డీఎస్పీగా ఎన్.సుధాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. 1991లో పోలీసుశాఖలో ఎస్ఐగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలు, వేముల, వేంపల్లె, చక్రాయపేట, కొండాపురంతో పాటు పలు పోలీసుస్టేషన్లలో విధులు నిర్వర్తించారు.

స్వయం ఉపాధి... భవితకు వారధి

● మహిళల ఆర్థిక భరోసాకు ప్రభుత్వం చేయూత
● జీవనోపాధుల రుణ ప్రణాళిక అమలుకు సర్వే ముమ్మరం


మైలవరంలో శిక్షణ పొందుతున్న ఎన్యుమరేటర్లు

మైలవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. సంఘాల్లోని మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు అందించి వారి ఆర్థిక స్వావలంభన సాధించేందుకు వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళిక అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సంఘాల సభ్యుల్లోనే యానిమేటర్లను ఎన్నుకుని వారితో జీవనోపాధుల రుణ ప్రణాళికను చేపట్టారు. ఈనెల మొదటి వారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న 35 మండలాల్లో ప్రారంభమైన సర్వే మరో నాలుగు రోజుల లోపు పూర్తి చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రుణాలు ఇలా...

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ఇప్పటి వరకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి వంటి పథకాల కింద బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. వీటితో పాటు పొదుపును కూడా రుణంగా వినియోగించుకోవాలని సూచిస్తున్నాయి. ప్రస్తుతం రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు సంఘాల సీనియార్టీ ప్రకారం బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి.

180 రకాల వ్యాపారాలకు అవకాశం...

ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రుణ జీవనోపాధుల అమలుకు సర్వే చేపట్టింది. మొత్తం 20 రంగాల్లో దాదాపు 180 రకాల వ్యాపారాలకు ప్రస్తుతం అవకాశం కల్పిస్తోంది. ముఖ్యంగా వ్యవసాయం, పట్టుపరిశ్రమ, చేపల పెంపకం, ఉద్యానం, లైవ్‌స్టాక్, తయారీ రంగం, సేవల రంగాల్లో హస్తకళలు, చేతివృత్తులు తదితర వ్యాపారాలు చేసుకునేందుకు ఈ సర్వే ద్వారా అవకాశం ఏర్పడుతుంది. సంఘంలోని మహిళల్లో పది, ఇంటర్ వరకు చదువుకున్న వారిని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా సర్వే చేస్తున్నారు.

జిల్లాలో సర్వే వివరాలు ఇలా..

మండలాలు	- 35
గ్రామ సమాఖ్యలు	- 1105
సంఘాలు	- 27,582
సభ్యులు	- 2,73,200 మంది
సర్వేచేస్తున్న ఎన్యుమరేటర్లు	- 4,725
సర్వే పూర్తయిన సభ్యులు	- 2,61,774 మంది
సర్వే శాతం	- 75.85 శాతం

(సోమవారం 5 గంటల వరకు)

ప్రభుత్వానికి నివేదిస్తాం..

వార్షిక జీవనోపాధుల సర్వే పూర్తయితే ఒక నిర్దేశిత ప్రణాళిక తయారు చేస్తాం. దాని ప్రకారం సంఘాల్లోని సభ్యులకు జీవనోపాధుల కోసం రుణాలు అందించి.. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తాం. త్వరగా సర్వే పూర్తి చేసి నివేదికలు ప్రభుత్వానికి పంపుతాం.

- ఆనందనాయక్, డీఆర్‌డీఏ పీడీ, కడప

ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం


మాట్లాడుతున్న స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ సురేష్‌బాబు

సిద్దవటం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ సురేష్‌బాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై మహిళా సమాఖ్యలతో భాగ స్వామ్యం ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. రైతుసాధికార సంస్థ స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమాఖ్య సంఘాలతో సంప్రదించి ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తుందన్నారు. రైతు సాధికార సంస్థ గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే రైతులను కమ్యూనిటీ రీసోర్స్‌పర్సన్(సీఆర్‌పీ)లుగా తీసుకుని వారి ద్వారా అమలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్, అదనపు ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు, మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ఏపీఎం సుజాత, మండల సమైఖ్య అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్పవారి చరిత్రను చదవాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో గొప్పవారి చరిత్రలు చదివి వారి ఆదర్శనీయమైన ఆలోచనలను జీవితానికి అన్వయించుకొని అనుసరించాలని వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ అన్నారు. బుధవారం వైవీయూ లలిత కళల శాఖలో కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా నాటక రంగ దినోత్సవం నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి రిజిస్ట్రార్ పద్మ, డీన్ గంగయ్య, శాఖ హెడ్ మృత్యుంజయరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం బాల్య వివాహాలను నిషేధించడం, వితంతు వివాహాలను ప్రోత్సహించడంతో పాటు బాలికల విద్య కోసం కృషి చేసిన మహానుభావుడన్నారు. కార్యక్రమంలో లలిత కళల శాఖ అధ్యాపకులు సీహెచ్ వెంకటేష్, చినరాయుడు, ఈరప్ప, వాసవి, చంటి సూరి, సిద్దిరాజ్ టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్,ఆఫీస్ సిబ్బంది లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


మూలవంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జగదీష్, మౌలాలిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

రక్తమోడిన రహదారులు

● వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి ● పలువురికి తీవ్ర గాయాలు


మౌలాలి, జగదీష్ (ఫైల్ ఫొటోలు)

సీకేదిన్నె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. కడప- రాయచోటి జాతీయ రహదారిలోని బుగ్గలేటి పల్లె వద్ద స్కూటర్‌ను బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. సీకేదిన్నె సీఐ శివశంకర్ నాయక్ వివరాల మేరకు... మూలవంక గ్రామానికి చెందిన వేంపల్లె మౌలాలి (19), వెంకట జగదీష్ (20) మంగళవారం అర్ధరాత్రి బుగ్గలేటి సమీపంలోని డాబాకు వెళ్లి భోజనం చేసి తిరిగి కడప వైపు వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఇరువురికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీకేదిన్నె పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో చికిత్స నిమిత్తం తరలించారు. జగదీష్ ఆస్పత్రికి చేరుకునేలోపే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మౌలాలి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఇద్దరిది ఒకే ఊరు కావడంతో మూలవంక గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. వెంకట జగదీష్ బెంగుళూరులో బీబీఏ చదువుతున్నాడు. ఇతని తండ్రి శ్రీరాములు కరోనాలో మృతి చెందగా.. తల్లి కష్టపడి జగదీష్‌ను చదివిస్తోంది. మౌలాలి ఇంటర్ వరకు చదువుకుని సీసీ కెమెరాల కంపెనీలో పనిచేస్తూ చదువుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఇరువురు స్నేహితుల మరణం కుటుంబీకులను, గ్రామస్తులను ఎంతగానో కలచివేసింది.

అవయవ దానం: రోడ్డు ప్రమాదంలో మరణించిన మౌలాలి కళ్లను వారికుటుంబ సభ్యులు దానం చేశారు. పలువురికి జీవితాన్ని ఇవ్వాలనే మౌలాలి చివరి కోరిక మేరకు వారి కుటుంబ సభ్యులు కళ్లను దానం చేశారు. ఇంతటి బాధతలో కూడా కుటుంబ సభ్యులు అవయవ దానం చేయడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

ఆటోను ఢీకొన్న మినీ లారీ.. మహిళ మృతి



చెన్నూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు అరుంధతీనగర్‌కు చెందిన లక్ష్మీ గాండ్ల బాలమ్మ (45) అనే మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కడప నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కూలీగా పనిచేస్తున్న ఈమె రోజూ ఉదయమే 5గంటల్లోపే హోటల్‌కు పనిచేసేందుకు వెళుతుండేది. ప్రతి రోజు లాగే బుధవారం ఉదయం స్థానిక కొత్తరోడ్డులో ఆటో ఎక్కింది. ఆమెతో పాటు చెన్నూరు కొత్తగాంధీనగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు అదే ఆటోలో వివిధ రకాల పనుల కోసం ఆటో ఎక్కారు. అదే సమయంలో మైదుకూరు వైపు నుంచి కడపకు వెళుతున్న మినీ లారీ వేగంగా వచ్చి ఆటో వెనుక వైపు ఢీకొంది. ఈ సంఘటనలో బాలమ్మ సంఘటనాస్థలంలో మృతి చెందగా.. డ్రైవరు పాలం రాజు, ఎద్దుల వెంకటేశ్‌తో పాటు తుమ్మలూరు సుబ్బమ్మ, వెంకటసుబ్బమ్మలు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కడపకు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

ట్రాక్టరు ఢీకొనడంతో మహిళ...


సరోజమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె

కమలాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): నగర పంచాయతీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సరోజమ్మ (48) అనే మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన సరోజమ్మ బుధవారం తన కుమార్తెతో స్కూటీపై వెళుతుండగా రైల్వేగేటు సమీపాన ట్రాక్టరు ఢీకొంది. దీంతో ఆమె ట్రాక్టరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. కమలాపురం ఎస్ఐ విద్యాసాగర్ సంఘటనాస్థలానికి చేరు కుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కాగా, మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ...తల్లీ కొడుకుకు తీవ్ర గాయాలు

చెన్నూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషయ్యగారిపల్లె వద్ద జాతీయ రహదారిపై బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో తల్లీ కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. అలంఖాన్‌పల్లెకు చెందిన చాగలమర్రి పెద్దవీరయ్య (26) తన పెళ్లి శుభలేఖలు ఇచ్చేందుకు తల్లి ఫక్కీరమ్మ (45)తో కలసి ద్విచక్ర వాహనంలో మైదుకూరు బయలుదేరాడు. శేషయ్యగారిపల్లె వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ సంఘటనలో పెద్దవీరయ్య, ఫక్కీరమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమత్తం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హౌసింగ్ పనులు వేగవంతం చేయాలి

చిట్వేలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ వి.సాంబశివయ్య అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణ అదికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీలకు ప్రస్తుతం ఇస్తున్న 1.80 లక్షలతో పాటు అదనంగా 50 వేల రూపాయలు, అలాగే ఎస్టీలకు 70 వేల రూపాయలు అదనంగా ప్రభుత్వం అమలు పరుస్తుందన్నారు. గ్రామాల్లో లేనివారికి అవగాహన కల్పించి నూతనంగా పొజిషన్ పెంచేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పనులు వేగవంతం చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట డివిజన్ ఈఈ మురళీకృష్ణ, చిట్వేలి హౌసింగ్ ఏఈ సుధాకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

మేడా రామలక్షుమ్మ నేత్రదానం


మృతురాలి నుంచి కార్నియాలను సేకరిస్తున్న దృశ్యం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని అంకాలమ్మపేటకు చెందిన మేడా రామలక్షుమ్మ (86) మరణించడంతో ఆమె కుటుంబీకులు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృతహస్తం సేవా సమితి వారికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మృతురాలి పార్థీవ దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేసేందుకు ప్రతి కుటుంబం ముందుకు రావాలన్నారు. నేత్రదానం చేయదలుచుకున్న వారు 7093204537 లేదా 9966500364లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ బుసిరెడ్డికి అరుదైన గౌరవం


ప్రిన్సిపాల్ నుంచి రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలో సర్టిఫికేట్ అందుకుంటున్న సుధాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాల భౌతికశాస్త్ర ప్రొఫెసర్ శాస్త్రవేత్త బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డికి మరోసారి అరుదైన గౌరవం లభించింది. ప్రపంచవ్యాప్తంగా 50వేల మంది సభ్యు లుగా ఉండే రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఫెలోగా అవకాశం దక్కిం చుకున్న ఈయన తాజాగా సొసైటీ వారు మెటీరియల్ కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాల్లో చేసిన ప్రతిభను గుర్తించి ఎఫ్ఆర్ఎస్సీ (ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ) అందించారు. దీనికి సంబంధించిన సర్టిఫికేట్‌ను అదేవిధంగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే రాయల్ సొసైటీ బ్యాడ్జిను డాక్టర్ బుసిరెడ్డికి పంపారు. బుధవారం కడపనగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ బ్యాడ్జిని డాక్టర్ బుసి రెడ్డికి తగిలించడంతో పాటు సర్టిఫికేట్‌ను అందించి అభినందించారు. ఈ సందర్భంగాపలువురు అధ్యాపకులు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేష్


సురేష్‌ను అభినందిస్తున్న కోనూరు సతీష్‌శర్మ

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన ఎంఎల్ఎన్ సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడుపర్యాయాలు యువజన విభాగ అధ్యక్షుడిగా సురేష్‌బాబు పనిచేశారు. మంగళవారం ఏలూరులో రాష్ట్రస్థాయి సేవా సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సురేష్ బాబుకు రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ నియామక ఉత్తర్వులు అందేశారు. 2025, 2026 రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో సాగుతారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి పాటు పడతానని తెలిపారు.

అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలి


స్కూల్ ఎడ్యుకేషన్ జేడీ సర్వీసెస్ పార్వతికి వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కేడర్‌లో జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోషియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావులు స్కూల్ ఎడ్యుకేషన్ జేడీ సర్వీసెస్ పయ్యావుల పార్వతికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు, వారి కుటుంబాలకు దూరంగా ఉన్నారని, భార్య, భర్తలు కొన్ని సంవత్సరాలుగా వారి పిల్లలకు దూరంగా ఉండటం దృష్ట్యా వెంటనే ఈ వేసవి సెలవుల్లో అంతర్ జిల్లల బదిలీలు చేపట్టాలని కోరారు. అలాగే మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యా యులకు ఈ వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టాలని కోరారు. ఎన్‌టీఏ నేతల వినతికి స్కూల్ ఎడ్యుకేషన్ జేడీ సర్వీసెస్ పార్వతి సానుకూలంగా స్పందించారని వారు తెలియజేశారు.

అంతర్ జిల్లాల బైకు దొంగల అరెస్టు

● 27 ద్విచక్రవాహనాలు స్వాధీనం ● మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ వెల్లడి


మాట్లాడుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

చాపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చాపాడు మండలంలోని అల్లాడుపల్లె దేవాలయం క్రాస్‌రోడ్డు వద్ద ప్రొద్దుటూరు, మైదుకూరు జాతీయ రహదారిపై ట్రైనింగ్ డీఎస్పీ భవానీ వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గు రు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి అరెస్టు చేసి విచారించగా.. ద్విచక్రవాహనాల చోరీ విషయం బయటపడినట్లు తెలిపారు. లింగాల మండలం వెలిదండ్ల గ్రామానికి చెందిన కర్ణ పవన్‌కుమార్‌రెడ్డి, కర్ణ లోక్‌నాథ్‌రెడ్డి, పులివెందుల పట్టణం రాజారెడ్డి కాలనీకి చెందిన గంగిరెడ్డి అశోక్‌రెడ్డిలు కలసి 29 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు తెలిపారు. వీటిలో 27 స్వాధీనం చేసుకోగా మరో రెండు స్వాధీనం చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ ముగ్గురు వ్యక్తులు తాడిపత్రి, అనంతపురం టౌన్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, చాపాడు, కడప, కదిరి, పులివెందుల, తొండూరు, ఎర్రగుంట్ల ప్రాంతాల్లో వాహనాలను చోరీ చేసినట్లు తెలిపారు. ముగ్గురిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ వాహనాలు స్వాధీనం చేసుకునేందుకు సమాచారం రాబట్టి సహకరించిన ఎస్ఐ చిన్నపెద్దయ్య, పోలీసులు మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మేంద్ర, తిరుమలయ్య, ప్రసాదు, రాఘవరెడ్డి, గణేష్, నవీన్, మధులను డీఎస్పీ, సీఐ అభినందించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త



మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల నిర్మాణంలో నాణ్యత ప్రమా ణాలు తప్పనిసరిగా పాటించాలని గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్త సూచించారు. డిసెంబరు నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. బుధవారం కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలిం చారు. అధికారులకు పలుసూచనలు సలహాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కడప రైల్వేస్టేషన్‌లోపలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీసీఎం ఎన్.మనోజ్, సీనియర్ డీఈ ఎల్లయ్య, సీనియర్ డీఈఎన్ అభిరామ్, కడప స్టేషన్ మాస్టర్ శేఖర్ కుమార్, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌తో పాటుపలువురు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

- తొలగించని పారిశుధ్య సిబ్బంది
- రోడ్ల పక్కనే చెత్త వేస్తున్న స్థానికులు
- పూడికతో నిండిపోయిన కాల్వలు





సన్‌సిటీ ఎదురుగా పేరుకుపోయిన చెత్త, పారని మురుగుతో కంపుకొడుతున్న కాల్వలు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఎక్కడ చూసిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. హోమియోపతి కాలేజీ రోడ్డు సన్ సిటీ ఎదురుగా కుప్పలుగా పోగువేస్తుం డడంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయి. డివిజన్‌లో డస్ట్‌బిన్‌లు ఏర్పాటుచేసినా నివాసితులు రోడ్ల పక్కనే చెత్త వేస్తుండడంతో చాలా అపరిశుభ్రంగా ఉంది. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ చెత్తను తొలగించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో నివాసితులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

కంపు కొడుతున్న కాల్వలు...: 48వ డివిజన్ పరిధిలోని కాల్వల్లో చెత్తను తీయడం లేదు. ఒకవేళ తీసినా దానిని కాల్వల పక్కనరోడ్డు మీదే వేస్తుండ డంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ నేపథ్యం లో పరిసరాలు, దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. కాల్వల్లో పూడిక పేరుకుపోయి, మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కొన్ని వీధులలో చెత్త తొలగించాల్సిన పారిశుధ్యం సిబ్బం ది రోజుల తరబడి రావడం లేదని, దీంతో చెత్త పేరుకుపోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నివాసితులంతా డస్ట్‌బిన్ లలోనే చెత్తను వేసేవారు. దీనిని పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించేవారు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపంతో సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని, అదే సమయంలో స్థానికులు రోడ్లపైనే చెత్తను వేస్తున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని డివిజన్లలో నెలలుగా పూడిక తొలగించకపోవడంతో పూర్తిగా కాల్వలు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అంతేకాకుండా స్థానికులు చెత్తను తీసుకువచ్చి క్యారీ బ్యాగ్‌లో కాల్వలో పడేస్తున్నారు. దీంతో కాల్వలో పూడిక పేరుకుపోతోంది. కార్పొరేషన్ సిబ్బంది ఎన్నిసార్లు హెచ్చరించినా స్థానికుల్లో మార్పు కనిపించడం లేదు.

ఈ-వేస్ట్ నియంత్రణకు చొరవ చూపాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ-వేస్ట్ నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. బుధవారం కడప ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. ఫిజిక్స్ లెక్చరర్ బయపురెడ్డి మాట్లాడుతూ ఈ-వేస్ట్ వల్ల కలిగే ప్రమాదాలు, వాటిని ఎలా నియంత్రించాలి, ఎలా సంరక్షితంగా నిర్వహించాలి అనే విషయాలపై సమగ్రమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అంకాల నాగరాజు, రమేష్‌యాదవ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీ యంత్ర పరికరాల కోసం దరఖాస్తు చేసుకోండి

లింగాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాయితీ యంత్ర పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏవో రమేష్ తెలిపారు. మండలంలోని పార్నపల్లె, వెలిదండ్ల రైతు సేవా కేంద్రాలలో రాయితీపై వచ్చిన పవర్ స్ప్రేయర్లను బుధవారం రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్ ద్వారా ఉపయోగించే యంత్ర పరికరాలు రాయితీపై అందిస్తామన్నారు. అవసరం ఉన్న రైతులు ఆర్ఎస్‌కేకి వెళ్లి దరఖాస్తుచేసుకోవాలన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు..?

కడప క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం బిల్టప్ సర్కిల్‌లోని పులివెందుల రోడ్డులో సాదక్‌వలీ మంగళవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. హత్య చేసిన నిందితుడిని అతనికి సహకరించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు మరియాపురానికి చెందిన చింపిరి వెంకటేశ్‌ను గత ఏడాది సాదక్‌వలి మద్యం సీసాతో పొడిచి హత్య చేశాడు. ఈ కేసులో రిమాండుకు వెళ్లి తిరిగి బయటికి వచ్చాడు. అయితే వెంకటేశ్ బంధువులను సాదక్‌వలి బెదిరిస్తుండేవాడని దీంతో అతని బంధువైన పెద్దోడు సాదక్ వల్లిని హత్య చేసి చంపాలని నిర్ణయించుకున్నాడు. కాగా మంగళవారం రాత్రి బిల్టప్ సర్కిల్‌లో మద్యం దుకాణం ఎదురుగా నిలిచి ఉన్న సాదక్‌వలిని కత్తితో పొడిచి ఆపై గొంతు కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. సాదక్‌వలి అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ప్రధాన నిందితుడితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. పాత కక్షలా..? లేక ఇతర కారణాలా అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. హత్యకు గురైన సాదక్‌వలి మృతదేహానికి పోస్టుమార్టం చేసి వారి బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఆశాలకు వేతనాలు ఇవ్వండి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆశా కార్యకర్తలకు మార్చి నెల బ్యాలెన్స్ వేతనం రూ.7200 తక్షణమే ఇవ్వాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ ఎఐటీయుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు.మరియమ్మ జిల్లా అధికారులను కోరారు. బుధవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రాష్ట్ర డైరెక్టర్ అనిల్‌కుమార్‌ను, జిల్లా అధికారి డాక్టర్ నాగరాజును కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.శాంతమ్మ, జిల్లా కోశాధికారి అమ్ములు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కడప సెవెన్ రోడ్స్ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ సేవలకులకు 2014 నుంచి వేతనాలు పెంచాలని వీఆర్ఏ యూనియన్ జిల్లా గౌరవా ధ్యక్షుడు మనోహర్ తెలిపారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్క రించాలని యూనియన్ నాయకులు బుధవారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు.

జీవో నెం.77 రద్దు చేయాలి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్న జీవో నెం.77ను రాష్ట ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని టీఆర్ఎస్ రాష్ట్ర కన్వీనరు శంకర్ తెలిపారు. బుధవార ం కమలాపురంలోని తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు అహల్య, ప్రగతిశీల రెవల్యూనరీ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనరు ఓరుగంటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

బస్‌షెల్టరు నిర్మించండి

చెన్నూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) :స్థానిక కొత్తరోడ్డులోని హైవే రహదారికి ఇరువైపులా బస్‌షెల్టరు లేక ప్రజలు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావని బీజేపీ జిల్లా మహిళా నాయకురాలు పెడబల్లె సరోజనమ్మ, మాజీ మండల శాఖ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావుకు స్థానికులతో కలిసి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు జి.మనోహర్, జీఎస్ సరస్వతి, స్వర్ణలత, ఆశాభాను, తులసి, మహేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయం పేరుతో చట్టాలు దుర్వినియోగం

కడప కలె క్టరేట్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): భారత దేశంలో ప్రజా స్వామ్యంఖూనీ చేసి రాజకీయం పేరుతో చట్టాల ముసుగులో నాయకులపై దాడులు కొనసాగుతున్నాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి ఎన్డీఏ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవాంరం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని(ఏ1), రాహుల్ గాంధీని(ఏ2)లపై చార్జీసీట్‌లు దాఖలు చేయడంపై నిరసిస్తూ నగరంలో కడప ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అలీఖాన్,సత్తార్,ఇర్ఫాన్ బాష తదితరులు పాల్గొన్నారు.

'కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి'

పులివెందులటౌన్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి):ప్రతి పక్షంపై బీజేపీ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని పీసీసీ డెలిగేట్ వేలూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీకి కాంగ్రెస్ అంటే భయం పట్టుకుందన్నారు. దేశంలో కాంగ్రెస్ ఎదుగుదలను జీర్ణించుకోలేక పోతున్నదన్నందుకే దర్యాప్తు సంస్థలు సీబీఐ ఈడీలను సొంత ఏజన్సీలుగా వాడుతోందన్నారు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీల మీద అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. మోదీ చేస్తున్న పనులను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు.

వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త

వేంపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగంపంతులు గొప్ప సంఘ సంస్కర్త అని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో కందుకూరి జయంతి పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, ఉత్తన్న ,అమర్‌నాథరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చెరసాల అంజనేయులు ఆధ్వర్యంలో కందుకూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించాలి

చక్రాయపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కరువుకు నిలయమైన చక్రాయపేట మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలాధ్యక్షురాలు మాధవి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కుళాయమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో గ్రామాలలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో కోరగా మండలంలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరాచేసి రైతులను ఆదుకోవాలని చక్రాయపేట ఎంపీటీసీ ఇందుకూరు లీలావతమ్మ డిమాండ్ చేయగా సభ్యులందరూ ఏకగ్రీవంగా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని తీర్మాణించారు. ముఖ్యంగా బీఎన్ తాండాలో తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నట్లు సభ్యులు డిమాండ్ చేశారు.సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టడంతో వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

వైభవం.. సీతారాముల కల్యాణం



సీకేదిన్నె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం పెద్దకాంపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మూడో రోజు సీతారాముల కల్యాణాన్ని, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను వేద పండితులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఆలయ ప్రారంభానికి కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు టి.వి.కృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, నాయుడు, రామసుబ్బారెడ్డి, భద్ర, అయ్యవారయ్య, సుబ్బనరసయ్య, ఈవో క్రిష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు.

పోషకవిలువల గురించి తెలుసుకోవాలి

పులివెందుల రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పోషకవిలువల గురించి తెలుసుకోవాలని పులివెందుల ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత సూచించారు. బుధవారం మండలంలోని అచ్చవెల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా 1000 రోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు.

'మైనారిటీల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయం'



మాట్లాడుతున్న షబ్బీర్

వేంపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ షబ్బీర్ తెలిపారు. వక్ఫ్‌బిల్లుకు రాజ్యసభలో మద్దతు ఇచ్చిన జగన్ పార్టీ బయటకు వచ్చి కోర్టులో కేసు వేయడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరి, కపట ప్రేమకు నిదర్శనమని ఆయన విమర్శించారు. వేంపల్లెలో బుధవారం మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, మహబూబ్ షరీఫ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఫయాజ్, సీనియర్ టీడీపీ నాయకులు రజాక్, మహబూబ్ షరీఫ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వక్ఫ్‌బిల్లుకు టీడీపీ మద్దతు ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నేతలు ఇలియాస్, ఎస్‌టి షరీఫ్, మదార్, అబ్దుల్, జబీఉల్లా, రఫి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నీలం బాలగంగాధర్ తిలక్‌కు కందుకూరి పురస్కారం

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె గ్రామానికి చెందిన డాక్టర్ నీలం బాలగంగాధర్‌తిలక్ కందుకూరి వీరేశలింగం పురస్కారాన్ని అందుకున్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా యోగివేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ పద్మ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘునాథ్‌కుమార్‌బాబుకు డాక్టరేట్

పులివెందుల రూరల్, ఏప్రిల్ 16: పులివెందుల జేఎన్టీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రఘునాథ్‌కుమార్‌బాబుకు డాక్టరేట్ లభించింది. ఈయన చెన్నైలో 'బిగ్ డేటా విత్ సైబర్ సెక్యూరిటీ'లో పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్ దక్కిందని ఆయన తెలిపారు. ఈనెల 15వ తేదీ డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి

కడప సెవెన్ రోడ్స్ ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): డీఎస్సీ నోటిఫి కేషన్ విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొని జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రైవేట్ విద్య కోసం దరఖాస్తు చేసుకోండి

పులివెందుల రూరల్, ఏప్రిల్ 16: ప్రైవేట్,ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఉచితంగా 1వ తరగతిలో చేర్పించేందుకు దర ఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో-2 రామానాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25శాతం సీట్లు కేటాయిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు.ఈ మేరకు ఐదేళ్లు నిండిన తమ పిల్లలను ప్రైవేట్‌లో గాని ఎయిడెడ్ పాఠశాలల్లో చేర్పించాలనుకునే తల్లిదండ్రులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు ఆధార్,ఓటర్,రేషన్, జాబ్‌కార్డు, విద్యుత్ బిల్లు, బర్త్ సర్టిఫికేట్‌తో దరఖాస్తులు అందించాలన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

అధికారులకు కలెక్టర్ అభినందనలు



కల్యాణోత్సవం సక్సెస్ మీట్‌లో కలెక్టర్ శ్రీధర్, జేసీ ,ఎస్పీ

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలను ప్రణాళికాబద్ధంగా అంగరంగ వైభవంగా విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన టీటీడీ యంత్రాంగం,జిల్లా అధికార యంత్రాంగానికి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అభినందనలు తెలిపారు. బుధవారం నగరంలోని శిల్పారామంలో ఒంటిమిట్ట సీతారాముల కల్యాణోత్సవ విజయవంతంలో కీలక పాత్ర పోషించిన జిల్లా యంత్రాంగాన్ని అభినందిస్తూ కలెక్టర్ సభను ఏర్పాటు చేశారు.

గ్యాస్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి





పులివెందుల, వేంపల్లెలో గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పులివెందుల రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, చిన్నపొరపాటు పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని పులివెందుల అగ్నిమాపక కేంద్రం అధికారి సునీల్ కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని రోటరీపురంలో మహిళలకు గ్యాస్ ప్రమాదాలు ఎలా జరుగుతాయి, వాటిని ఎలా ఎదుర్కోవాలనే విషయాలను డెమో చేస్తూ వివరించారు. వంటపని అయిపోగానే సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలన్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె..: గ్యాస్ సిలిండర్ల, స్టవ్‌ల నుంచి అగ్ని ప్రమాదాలు ఎదురైనపుడు ధైర్యంగా ముందడుగు వేయాలని ఫైర్ అధికారి సూచించారు.రాజీవ్‌నగర్ కాలనీలో గ్యాస్ సిలిండర్ ప్రమాదం జరిగినపుడు మంటలుఆర్పివేసే విధానం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది రామకృష్ణ, హరిబాబు, శివకుమార్, ఉత్తమారెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు అందించారు. ఎక్కడ ప్రమాదం జరిగిన 101కు ఫోన్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

● రూ.8 వేల నగదు స్వాధీనం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ.8 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. తమకు రాబడిన సమాచారం మేరకు పోరుమామిళ్ల మండలంలోని జిల్లెల్ల ఎస్సీ కాలనీ సమీపంలో ఆరుగురు పేకాట ఆడుతూ ఉన్నారని, కాగా ఇరువురు పరారు కాగా, మిగతా నలుగురిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మసీదు నూతన కమిటీ ఎంపిక



రికార్డులను నూతన కమిటీకి అప్పగిస్తున్న వక్ఫ్ ఇన్‌స్పెక్టర్

ప్రొద్దుటూరుటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామేశ్వరంలోని మజ్లిస్ఏ జామియా మసీదు నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆ కమిటీ అధ్యక్షుడు పి.మహబూబ్‌బాష తెలిపారు. ఉపాధ్యక్షుడిగా వడ్ల బాబా బాష, కార్యదర్శిగా బేపారి ఆరీఫ్ అహ్మద్, కోశాధికారి షేక్ దాదాపీర్, సభ్యులు ఎంపికయ్యారు. నూతన కమిటీకి మసీదు బాధ్యతలను అప్పగిస్తూ వక్ఫ్‌బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. మసీదులో ప్రార్థనల కోసం వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించి మసీదును అభివృద్ధి చేస్తామని తెలిపారు.

సబ్సిడీ పరికరాలు అందజేత

ముద్దనూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీ వ్యవసాయ పరికరాలను బుధవారం రైతులకు అందజేశారు. కొలవలి, ఉప్పలూరు, యామవరం గ్రామ పంచాయతీలోని రైతులకు సస్యరక్షణ విభాగం కింద పవర్‌స్ప్రేయర్లు అందించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ వెంకటరమణ, రామసుందర్‌రెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి మల్లెంకొండేశ్వరస్వామి తిరునాళ్లు

గోపవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుచ్చనపల్లెలో కొలువైన అంకాలమ్మ సహిత మల్లెంకొండేశ్వరస్వామి తిరునాళ్లు ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి పాలాభిషేకం, చండీయాగం తదితర కార్యక్రమాలు చేస్తామని భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

ముద్దనూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం సభాభవనంలో గురువారం ఉదయం 10-30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ముకుందారెడ్డి తెలిపారు. సమావేశంలో ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, వైద్యం, గృహ నిర్మాణం గురించి చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

'వక్ఫ్‌బోర్డు చట్టం రద్దు చేయాలి'

పోరుమామిళ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పఠాన్ చాంద్‌బాషా, మండల కార్యదర్శి భైరవప్రసాద్ అన్నారు. బుధవారం పోరుమామిళ్లలోని హుసేన్‌పీర్ దర్గాలో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం రాజ్యాంగ బద్ధత సవాళ్లు అనే అంశాలపై ఈ నెల 21న కడపలో రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా సమావేశానికి సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు.

ప్రొద్దుటూరు అభివృద్ధికి సహకరించండి

● సీఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



సీఎంతో వరదరాజులరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అభివృద్ధికి నిధులు ఇచ్చి సహకరించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. బుధవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా వరదరాజులరెడ్డి ప్రొద్దుటూరులో ప్రధాన రోడ్ల విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాల సహకరించాలని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన మార్కెట్ నిర్మాణ పనులకు, ఆర్టీపీపీ మార్గంలో పెన్నా నదిమీద సాగుతున్న హైలెవెల్ వంతెన, ఐదు ప్రధాన మురికి నీటి కాలువల ఆధునీకరణకు, నిధులు అందించాలని కోరినట్లు తెలిపారు. అలాగే నామినేటెడ్ పోస్టులలో పార్టీ కోసం పనిచేసిన వారికి న్యాయం చేయాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ ముక్తియార్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట మహేశ్వరరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ వద్ది బాలుడు, పార్టీ పరిశీలకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపుతోనే చార్జిషీట్ : తులసిరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

ప్రొద్దుటూరుటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులో భాగంగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జిషీట్‌లు నమోదు చేసిందని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. బుధవారం ఎగ్జిక్యూటివ్ హెల్త్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ వ్యవస్థలన్నింటిని దుర్వినియోగం చేస్తోందని పేర్కొన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ చార్జిషీటు వేయడం మోదీ ప్రభుత్వ రాజకీయ కక్షకు పరాకాష్ఠ అన్నారు. గత పదేళ్లలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉందన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి రాజధాని నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పీఎండీ నజీర్, సుజిత్, ఆలీ, అమర్‌నాథరెడ్డి, జయరామిరెడ్డి, ఖాజా, బాబా, నాగరాజు, రమణ, వినయ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం

● టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల ఫిర్యాదులకు సంబంధించి ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. వాటికి సంబంధించి వెంటనే ఫోన్‌లో అధికారులతో మాట్లాడి పరిష్కారం చేశారు. అనంతరం పలువురికి సీఎం సహాయనిధి కింద రూ.4,43,721 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేపరాల, పెద్దపసుపుల, జమ్మలమడుగు ప్రాంతాలకు చెందిన ప్రజలు, నాయకులు వంగల నాగేంద్రయాదవ్, వేపరాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఏకగ్రీవ ఆమోదం

ప్రొద్దుటూరురూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని గోపవరం పంచాయతీ అభివృద్ధి పనులకు సర్పంచు, వార్డు సభ్యులు ఏకగ్రీవ తీర్మాణంతో ఆమోదం తెలిపారు. ఇటీవల గోపవరం ఉపసర్పంచ్ ఎన్నిక రెండు రోజులపాటు ఉత్కంఠ పరిణామాల నేపథ్యంలో వాయిదా పడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత జరిగిన సాధారణ సభ్య సమావేశం బుధవారం సర్పంచు మోషే అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 20 మంది వార్డు మెంబర్లకు గాను 14 మంది హాజరయ్యారు. పంచాయతీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు అజెండాలో పొందుపరిచిన 23 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సుమారు 12 లక్షల వ్యయంతో మైలవరం ఉత్తర కాలువ పూడికల తీసివేతలను త్వరలో ప్రారంభించనున్నట్లు కార్యదర్శి రామకృష్ణ తెలిపారు.

మెగా జాబ్‌మేళా విజయవంతం



నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరుటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎస్‌కేఎస్‌ఈ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైందని ఆ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జాబ్‌మేళాలో కియా మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఆల్‌డిక్షన్ కంపెనీ వంటి 15 ప్రముఖ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ అభ్యర్థులు 463 మంది జాబ్‌మేళాకు హాజరయ్యారని తెలిపారు. ఇంటర్వ్యూల అనంతరం 131 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఏపీఎస్ఎస్‌డీసీ, కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో నియామకపత్రాలు అందజేశారు. వారిని ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి, కరస్పాండెంట్ ఎన్.కొండారెడ్డి, సీఈవో మీనాకొండారెడ్డి, అభినందనలు తెలిపారు.

హెచ్‌టీ పత్తి విత్తనాలపై తనిఖీ

ప్రొద్దుటూరురూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని, కలుపు మందులను తట్టుకునే హెచ్‌టీ పత్తి విత్తనాల సాగు నిరోధించే క్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. బుధవారం సాయంత్రం ప్రొద్దుటూరు పట్టణంలోని వెంకటేశ్వర విత్తన ఏజెన్సీ దుకాణంలో కడప డీఏవో ఎస్.గోవర్ధన్, ప్రొద్దుటూరు ఏడీఏ పి.సురేష్‌రెడ్డి, ఏవో శివశంకర్‌రెడ్డిలతో కూడిన బృందం ఈ తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఇన్‌స్టాంట్ కిట్లను ఉపయోగించి వివిధ కంపెనీల పత్తి విత్తనాలను పరిశీలించారు. జిల్లాలోని వేంపల్లె, పులివెందుల, ముద్దనూరు, జమ్మలమడుగు, రాజుపాళెం, దువ్వూరు, పోరుమామిళ్ల, మైదుకూరు, ప్రొద్దుటూరు మండలాల్లో వివిధ కంపెనీల విత్తనాల నాణ్యతను పరిశీలించినట్లు వ్యవసాయ శాఖ జిల్లా డీఏవో ఎస్.గోవర్ధన్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపట్టాల్సిందిగా స్థానిక ఏడీఏ సురేష్‌రెడ్డి, ఏవో శివశంకర్‌రెడ్డిలకు సూచించారు.

20న తిరుమల పాదయాత్ర

రాజుపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా మండల కేంద్రమైన రాజుపాలెం నుంచి తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా వస్తోందని, ఈ నెల 20న ప్రారంభంకానున్న పాదయాత్రలో భక్తులు పాల్గొనాలని కమిటీ నిర్వాహకులు కోరారు. ప్రతియేటా లాగానే ఈ ఏడు కూడా మండల కేంద్రమైన రాజుపాలెం కోదండరామస్వామి ఆలయం వద్ద నుంచి ఆదివారం ఉదయం 5 నుంచి 6 గంటల్లోగా పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. పాల్గొనే భక్తులు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు.

బ్లాస్టింగ్ ఇబ్బందులను తొలగించండి

● జేసీకి గ్రామస్థుల ఫిర్యాదు



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భారతి సిమెంట్ కర్మాగారం మైన్స్‌లో చేసే బ్లాస్టింగ్ వల్ల తమ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని సుంకేసుల ప్రజలు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం కడపలోని ఆమె కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి కేవలం 400 మీటర్ల దూరంలోనే మైనింగ్ జరుగుతుందని, దీని వల్ల పెద్ద స్థాయిలో భూమి కంపిస్తోందన్నారు. కారణంగా ఇళ్ల గోడలు నెర్రలు చీలడంతో పాటు పాత ఇల్లు కూలిపోతున్నాయన్నారు. అంతేకాక బ్లాస్టింగ్ శబ్దాల వల్ల గుండె జబ్బు, కెమికల్స్ వల్ల చర్మ, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయని, వెంటనే సమస్యను పరిష్కరించాలని జేసీని కోరారు.

విత్తనగుళికల తయారీపై అవగాహన

ముద్దనూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి బడుగువారిపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిన బీజామృతంలో విత్తన శుద్ధిపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఎన్ఎఫ్ఏ మేరి ఆధ్వర్యంలో 30 రకాల విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేశారు. అందులో ముందుగా విత్తనాలకు బంక మట్టితో కోటింగ్ చేసి తరువాత ఘనజీవామృతం చల్లి, అనంతరం విత్తనగుళికలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నూజహత్, మునిభూపాలుడు, రామసుధ, రాధిక సల్మా, శ్రీదేవి, పుష్ప పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

బద్వేలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో ఆర్కే అపార్ట్‌మెంటు వద్ద అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా బుధవారం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సుధాకర్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజలు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు: జమ్మలమడుగులో అగ్నిమాపక సిబ్బంది, అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని కన్నెలూరు గ్రామం ఎస్సీ కాలనీలో జమ్మలమడుగు అగ్నిమాపక సిబ్బంది స్థానిక ప్రజలకు ఇంట్లో గ్యాస్, విద్యుత్తు ప్రమాదాలపై వివరించారు. కార్యక్రమంలో సీఐ సత్యంరెడ్డి, వారి సిబ్బంది జాగ్రత్తలు తెలియజేశారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి

ప్రొద్దుటూరుటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పాండురంగన్‌రవి తెలిపారు. బుధవారం కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు ఫేర్‌వెల్‌డే వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు త్వరగా ఉద్యోగాలు సాధించి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఎంబీఏ హెచ్‌వోడీ షబానాబీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని అప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండు కౌంటర్లు ఏర్పాటు

జమ్మలమడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో బుధవారం పునరావాస ఆధార పత్రాల పరిశీలనకు అధికారులు రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. కొండాపురం మండలం పి.అనంతపురం గ్రామ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ గెజిట్ సంబంధించి పరిహారం కోసం హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆధార పత్రాల పరిశీలన కొరకు ఏర్పాటు చేశారు.

నిరాశ్రయుల సెంటర్ తనిఖీ



సెంటర్‌ను పరిశీలిస్తున్న జడ్జి ఖాజామైనుద్దీన్

మైదుకూరురూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినాథపురం వీధిలో ఉండే నిరాశ్రయుల రక్షణ సెంటర్‌ను మైదుకూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఖాజామైనుద్దీన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్ నిర్వహిస్తున్న కృష్ణయ్య సెంటర్‌లో లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంటర్‌లో రికార్డులను ఆయన పరిశీలించారు. వంటగది, మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో జడ్జి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఈ సెంటర్లకు సంబంధించిన అన్ని వివరాలతో కోర్టులోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. ఈ సెంటర్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథల ఆధార్‌కార్డుల వివరాలు, వారి వ్యక్తిగత పనులకోసం వచ్చిన వివరాలు తెలపాలన్నారు. జడ్జి వెంట అడ్వకేటర్ శివరామకృష్ణ, శ్రీనివాసులు, కరిముల్లా, ఎస్ఐ సుబ్బారావు ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గత నెల 17న శంకరాపురం క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. గత నెల 17న సాయంత్రం సీతారామపురం క్రాస్ రోడ్డు వద్ద బోర్‌వెల్ ఆపరేటరు మనోహర్ తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవరు రామస్వామి అతివేగంగా బస్సు నడిపి ఢీకొన్నాడు. ఇందులో మనోహర్‌కు కన్ను, కాలుకు గాయాలయ్యాయన్నారు. చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వేలూరు తరలించారని తెలిపారు. ఆ స్టేషనుకు సంబంధించి బుధవారం ఫిర్యాదు ఇవ్వగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రజా దర్బారుకు విశేష స్పందన



ప్రజా సమస్యలను వింటున్న విజయమ్మ

బద్వేలు టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కూటమి అభ్యర్థి బొజ్జరోశన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా దర్బారుకు విశేష్పందన లభించింది. తమ సమస్యలను సాదక బాధలను చెప్పుకోవడానికి వందలాది మంది ప్రజలు పార్టీ కార్యాలయానికి వచ్చారు. పెన్షన్లు, ఇంటిస్థలాలు మంజూరు చేయాలని వినతిపత్రాలను ఇచ్చారు. కాగా సంబంధిత అధికారులకు వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ విజయమ్మ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

గోపవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత విజయాలు సాధించిన గోపవరం హైస్కూలు ప్లస్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు గోపవరం మండలం పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఎస్టీయూ, ఆపస్ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాశాఖాధికారులు చెన్నయ్య, రఘురామిరెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రవిశంకర్, ఓబుల్‌రెడ్డి, నరసింహారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, మునెయ్య, గోవింద్, శేషారెడ్డి, రామచంద్రయ్య, హైస్కూలు క్లాస్ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన



రాజన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

చాపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చాపాడులోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారి కోర్కెను నెరవేర్చాలని వారు కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లను గ్రామ పంచాయతీ ఉద్యోగిగా గుర్తించాలని బదిలీలు చేపట్టాలని, ఇన్సూరెన్స్ కల్పించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. వారిలో పుల్లయ్య, మనోహర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, రాజయ్య, వెంకటసుబ్బయ్య, రమణ, చంద్ర, మరో 20 మంది ఉన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ రాజన్నకు వారు వినతిపత్రం అందించారు.

లోకేశ్ చేతుల మీదుగా అవార్డు



లోకేశ్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మైత్రి

కలసపాడు,ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారెడ్డిపల్లెకు చెందిన మైత్రి ఇంటర్ (హెచ్‌ఈసీ) గ్రూప్‌లో 897 మార్కులు సాధించింది. ఈ మేరకు మంత్రి నారాలోకేష్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి షైనింగ్ స్టార్ అవార్డు అందుకుంది. ఈ విద్యార్థి పెండ్లిమర్రి మండలంలోని కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ చదివారు. చదువులో అత్యుత్తమంగా రాణించడంతో మైత్రికి రాష్ట్రస్థాయి అవార్డు వచ్చిందని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రెడ్డిజ్యోతి, ఉపాధ్యాయనిలు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న సర్పంచ్ యనమల సుధాకర్

పోరుమామిళ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకాన్ని పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ తనిఖీ చేశారు. బుధవారం ఆయన పోరుమామిళ్లలోని జడ్పీ హైస్కూలులో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నందుకు సీఎంకు అభినందనలు తెలిపారు.

20న చింతకుంటలో గంగజాతర

దువ్వూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటలో ఈ నెల 20న గంగజాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 18న రాత్రి పెద్దిరాజు కథ, 19న ఆకుపూజ, 20న గ్రామస్తులంతా జాతర నిర్వహిస్తున్నట్లు వివరించారు.